పర్యావరణ హితుడు..

- 24 ఏళ్లుగా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా సేవలు
- గోడలపై బొమ్మలు గీసి విద్యార్థులకు బోధన
- పక్షులకు ప్రత్యేక గూళ్ల నిర్మాణం
- ఇల్లు, బడి, గుడి వద్ద మొక్కల సంరక్షణ

కోరుట్లటౌన్: పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన దురిశెట్టి శ్రీనివాస్ చారి 24 ఏళ్లుగా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా సేవలు అందిస్తూ పర్యావరణ పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్నారు. ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న క్రమంలో అక్కడి పాఠశాల ఆవరణలో మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో పచ్చదనంతో నిండిపోయాయి. పుట్టిన ఊరులో గుడి, బడి వద్ద పచ్చదనం కోసం ప్రత్యేకంగా పండ్లు, పూల మొక్కల అభివృద్ధికి కృషి చేసి, అందరి అభిమానాలు పొందారు. విద్యార్థులకు పాఠశాల గోడలపై చిత్రాలు గీసి వినూత్నంగా, పాఠ్యాంశాలు సులువుగా అర్థమయ్యేలా చెప్పి విద్యార్థుల తల్లిదండ్రుల మెప్పు పొందారు. ఉపాధ్యాయులుగా పని చేసిన ప్రతీ పాఠశాలలో మొక్కలు పెంచడంతో పర్యావరణ హితుడుగా పేరు తెచ్చుకున్నారు. పక్షులకు గూళ్లు ఏర్పాటు చేసి, ప్రకృతి ప్రేమికుడిగా పేరు సంపాదించాడు.



అధికారులు,ప్రజాప్రతినిధులు చేతులమీదుగా శ్రీనివాస్‌చారికి సన్మానం

సండే స్పెషల్



ఉత్తమ సేవలకు గుర్తింపు..

- 2009– జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు,తపస్ యూనియన్, కరీంనగర్ .
- 2010–చొప్పదండి హన్మంత రెడ్డి స్మారక కమిటీ డివిజన్ ఉత్తమ ఉపాధ్యాయ సన్మానం,

పర్యావరణ సంరక్షణ..

- ఇల్లు, బడి, గుడి ఆవరణలో స్నేహితులతో కలిసి మొక్కలు నాటి, వాటిని సంరక్షించారు. ఇంటి ఆవరణలో మామిడి, సపోట, సంత్ర, నిమ్మ, ద్రాక్ష, జామ, బొప్పాయి, మునగ, చిక్కుడు, బీరకాయ, వంకాయ, టమోటతో పాటు గులాబీ, మందార, పారిజాతం, రామబాణం వంటి పూల మొక్కలు పెంచారు.

పక్షులకు ప్రత్యేక గూళ్లు..

- ఇంటి ముందు ఆవరణలో పక్షులకు గూళ్లు నిర్మించారు. నీళ్లు, ఆహార ధాన్యం గింజలు ఏర్పాటు చేయడంతో పక్షులు, ఉడుతలు సేద తీరుతున్నాయి. ఈ క్రమంలో ప్రకృతి ప్రేమికుడిగా శ్రీనివాస్‌చారి పేరు పొందాడు.

విద్యాభ్యాసం..



- దురిశెట్టి శ్రీనివాస్ చారి స్వగ్రామం వెంకటాపూర్‌లో ప్రాథమిక విద్య, మోహన్‌రావుపేటలో హైస్కూల్ విద్య మోహన్ రావుపేట, ఇంటర్ కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ ఎస్‌కేఎన్‌ఆర్ జగిత్యాల, బీ.ఈడీ, పీజీ ఎం.ఏ.తెలుగు హైదరాబాద్, డిస్టెన్స్‌లో ఎం.ఎస్సీ జువాలజీ పూర్తి చేశారు. 1998 డీఎస్సీలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా జెడ్పీహెచ్‌ఎస్ వల్లపల్లిలో ఉద్యోగం పొందారు. 2002–2009 వరకు జెడ్పీహెచ్‌ఎస్ వెంకటాపూర్, 2009 నుంచి 2012 వరకు చిన్నమెట్‌పల్లి పాఠశాలలో ఎస్జీటీగా పని చేశారు. 2012లో స్కూల్ అసిస్టెంట్ తెలుగు పదోన్నతి వచ్చి పైడిమడుగు జెడ్పీ హైస్కూల్‌లో ప్రస్తుతం పనిచేస్తున్నారు. సబ్జెక్టు బోధన చేస్తూ విద్యార్థులకు క్రమశిక్షణ, ప్రకృతి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రశంసలు పొందారు.



విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



విద్యార్థులకు విద్యతో పాటు సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా పని చేస్తున్నాను. ఆదరించి చెప్పేవాడే నిజమైన ఆచార్యుడు అనే ఉన్నత వ్యక్తిత్వంతో ముందుకు సాగుతాను. పర్యావరణ పరిరక్షణకు నా వంతుగా కృషి చేయడం గొప్ప అనుభూతినిస్తోంది.

– దురిశెట్టి శ్రీనివాస్‌చారి, తెలుగు ఉపాధ్యాయుడు, కోరుట్ల

క్లుప్తంగా

పట్టణ సమస్యల పరిష్కారమే లక్ష్యం



రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు

కోరుట్ల: పట్టణంలో సమస్యల పరిష్కారమే కోరుట్ల డెవలప్‌మెంట్ ఫోరం లక్ష్యమని ఫోరం కన్వీనర్ చెన్నా విశ్వనాథం, కో–కన్వీనర్ పేట భాస్కర్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని సీ. ప్రభాకర్ భవన్‌లో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి కోరుట్ల డెవలప్‌మెంట్ ఫోరంను నూతనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో వందల ఎకరాల భూమి అన్యాక్రాంతం అవుతున్నప్పటికీ ఇళ్ల స్థలాల కోసం పోరాటం చేస్తున్న నిరుపేదలను విస్మరిస్తున్నారని ఆరోపించారు. గ్రామ కంఠంలోని గడి బురుజుల ప్రాంతంలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవటం లేదన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటైన కోరుట్ల డెవలప్‌మెంట్ ఫోరం కన్వీనర్, కో–కన్వీనర్లతో పాటు 21 మంది సభ్యులను కమిటీ నాయకులుగా ఎన్నుకున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందిస్తున్న చైర్మన్

ధర్మపురి: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందిన ధర్మపురికి చెందిన సాక లింగయ్యకు మంజూరైన రూ.35 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్ శనివార అందజేశాడు. కార్యక్రమంలో బూరుగుపల్లె సర్పంచ్ కంది తిరుపతి, టీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుల రాజేశ్, గడ్డం బాల్‌రాజు తదితరులున్నారు.

పేదలకు డబుల్‌బెడ్ రూం ఇళ్లు అందని ద్రాక్షే



డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న శ్రావణి

జగిత్యాలరూరల్: ప్రభుత్వం నిరుపేదలకు నిర్మిస్తున్న డబుల్‌బెడ్‌రూం ఇళ్లు పేదలకు అందని ద్రాక్షగా మారాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి అన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలం అంతర్గాంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలించి మాట్లాడారు. ఎమ్మెల్యే సొంత గ్రామంలోనే కనీసం ఒక డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారులకు ఇవ్వలేదన్నారు. రెండేళ్లలో సచివాలయం కట్టారు కానీ మీరు గెలిచి నాలుగేళ్లు గడిచినా ఎందుకు ఒక డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారులకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు నలువాల తిరుపతి, సోమేశ్వర్, రాజన్న, రమేశ్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

నానో డీఏపీతో రైతులకు అధిక ప్రయోజనాలు



మాట్లాడుతున్న ఇఫ్‌కో మేనేజర్

సారంగాపూర్: ద్రవరూపంలో ఉన్న డీఏపీని పంటలకు వినియోగిస్తే రైతులకు అధిక ప్రయోజనాలు ఉంటాయని ఇఫ్‌కో మేనేజర్ శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం ఇఫ్‌కో సంస్థ ఇటీవల కేంద్ర మంత్రి అమిత్‌షాతో మార్కెట్‌లోకి విడుదల చేసిన నానో డీఏపీపై రైతులకు అవగాహనకల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఏపీ గులికల 50 కిలోల సంచికి రూ. 1350 ఉండగా, ద్రవరూపంలోని అరలీటరు డీఏపీకి కేవలం రూ. 600 అన్నారు. నానో డీఏపీ పంటలకు మెరుగైన పోషకాలను అందిస్తుందన్నారు. సమావేశంలో ఏఈవో వెంకటేశ్, సీఈవో ఇస్మాయిల్, శివ, భూమేశ్, రైతులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

రాయికల్: పట్టణంలో దోమల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. శనివారం రాయికల్ పట్టణంలో ఫాగింగ్ యంత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డులో దోమల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ సంతోష్‌కుమార్, కౌన్సిలర్లు మ్యాకల కాంతారావు, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి



మైతాపూర్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏడీఈ

రాయికల్: విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని ఏడీఈ హరీశ్ అన్నారు. మండలంలోని మైతాపూర్, రామాజీపేట గ్రామాల్లో విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినియోగదారులు విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజనాల మధుకర్, లైన్‌మెన్ రమేశ్‌బాబు, సంతోష్, లక్ష్మీరాజం పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లేది కార్యదర్శులే

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లేది పంచాయతీ కార్యదర్శులేనని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి నర్సింగరావు అన్నారు. శనివారం మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించి, వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించేవరకూ కాంగ్రెస్ పార్టీ పక్షాన పోరాటం చేస్తామన్నారు. అలాగే గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బంది, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, వారికి వేతనాలు నెలనెలా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడుగూడ శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దుదిగం గంగాధర్, మెట్‌పల్లి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి సురేందర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రహదారులకు మహర్దశ

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాలరూరల్: రాష్ట్రంలో రహదారులకు మహర్దశ వచ్చిందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. శనివారం కండ్లపల్లి నుంచి రాయికల్ మండలం అల్లీపూర్ వరకు రూ.60 లక్షలతో నిర్మించే బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో కొత్త రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసిందన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రభాగాన ఉండేలా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచులు చంద రజిత, స్వరూప, తిరుపతి, దామోదర్, ఎంపీటీసీలు సౌజన్య, సారిక, సింగిల్ విండో చైర్మన్ రాజలింగం పాల్గొన్నారు.

జగిత్యాల: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని మెడికల్ కళాశాల చుట్టూ చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే కళాశాలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని, నాణ్యతతో కూడిన పనులు చేయాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గానికి చెందిన 50 మంది ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా మంజూరైన చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆడబిడ్డల సంక్షేమానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, జెడ్పీటీసీ మహేశ్, మండల కన్వీనర్ శంకర్, రామ్‌కుమార్ పాల్గొన్నారు.మాతశిశు సంక్షేమ కేంద్రాన్ని తనిఖీ చేసి గర్భిణులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అప్పుడే పుట్టిన చిన్నారిని ఎత్తుకుని ఆరోగ్యాన్ని బాగా చూసుకోవాలని వారికి సూచించారు.

మైతాపూర్ ఎల్లమ్మతల్లి ఆలయానికి రూ.1.50 లక్షలు మంజూరు

రాయికల్: మండలంలోని మైతాపూర్ ఎల్లమ్మతల్లి ఆలయానికి రూ.1.50 లక్షలు మంజూరు కాగా, ప్రొసీడింగ్ కాపీని శనివారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ గౌడ సంఘం నాయకులకు అందజేశారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎస్టీవోకు వినతిపత్రం ఇస్తున్న పెన్షనర్లు

కోరుట్ల రూరల్: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పెన్షనర్ల అసోసియేషన్ కోరుట్ల ఆధ్వర్యంలో శనివారం ఎస్టీవో లావణ్యకు వినతిపత్రం సమర్పించారు. తమ సమస్యలను రాష్ట్ర ట్రెజరీ అధికారికి పంపాలని వినతిపత్రంలో కోరారు. పింఛన్‌దారుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ప్రతీ నెలా పెన్షనర్ల నుంచి ఆదాయపు పన్ను మినహాయించాలని రాష్ట్ర డైరెక్టర్‌ను కోరటం శోచనీయమన్నారు. చాలా మంది పెన్షన్‌దారులు ఆదాయపు పన్ను పరిధిలోకి రారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ప్రతీ నెలా ఆదాయపు పన్ను ఆదేశాలు రద్దు చేసి గతంలో పద్ధతినే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ కోరుట్ల డివిజన్ అధ్యక్షుడు పబ్బా శివానందం, కార్యదర్శి గంటేడి రాజ్ మోహన్, ఉపాధ్యక్షుడు ఎండీ సైఫొద్దీన్, కోశాధికారి నల్ల లక్ష్మి, నారాయణ, చిలుక గంగారాం, వివిధ మండలాల పెన్షనర్లు, ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ఉద్యోగులు, సిబ్బందిని క్రమబద్ధీకరించాలి

మల్లాపూర్: ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికులను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ మండల అధ్యక్షుడు తిప్పనవేని సుధాకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని భరతమాత కూడలి వద్ద గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె చేపట్టారు. కార్యక్రమంలో జేఏసీ మండల ప్రధాన కార్యదర్శి గడచంద శ్రీనివాస్, కార్యనిర్వహణ అధికారి ముద్దం శ్రవణ్, నాయకులు పాల్గొన్నారు.

రాయికల్: గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కారోబార్‌లు, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. జీవో 51ని రద్దు చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సంఘ నాయకులు దొంతి రాజేందర్, కిశోర్, ప్రసాద్, శంకర్, జలేందర్, లచ్చం పాల్గొన్నారు.

జగిత్యాల రూరల్: గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నిరసిస్తూ పారిశుద్ధ్య కార్మికులు శనివారం జగిత్యాల మండల పరిషత్ కార్యాలయం ముందు నిరసన దీక్ష చేపట్టారు. తమ సమస్యలను పరిష్కరించేంత వరకు గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేపట్టమని హెచ్చరించారు.

అకాల వర్షంతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

మల్లాపూర్: అకాల వర్షానికి పంట నష్టపోయిన బాధిత రైతులకు ప్రభుత్వం తక్షణమే పరిహారం ప్రకటించాలని టీడీపీ జిల్లా ప్రోగ్రాం కన్వీనర్ మానుక ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు గొర్రెపల్లిలో తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అకాల వర్షం ప్రతి రైతుకు తీరని ఆవేదనను మిగిల్చిందన్నారు. చేతికందుతుందనుకున్న వరి, మామిడి, నువ్వు, సజ్జలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం నష్టపోయిన ప్రతి రైతుకు వెంటనే పరిహారం చెల్లించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ. సాదుల్లా, సీనియర్ నాయకులు నిమ్మల రాములు, మేడిపట్ల అశోక్,సాయిలు, నూనె రమణయ్య, పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ సరికాదు

జగిత్యాల: ఏలాంటి హోదా లేని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు కుమారుడు సంజయ్ కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయడం సమంజసం కాదని వైఎస్సార్‌టీపీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి సత్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజాప్రతినిధి, ప్రభుత్వ అధికారి కాని సంజయ్ ఏ హోదాతో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. దీనిపై జిల్లా న్యాయ సేవ అధికారికి ఫిర్యాదు చేసి, తహసీల్దార్లకు నోటీసులు పంపించామని తెలిపారు. శనివారం హాజరు కావాలని న్యాయసేవ అధికారి ఆదేశాలు జారీ చేసినా హాజరు కాకపోవడంతో నోటీసులు అందజేశారన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన డీఆర్డీవో

మేడిపెల్లి: భీమారం మండలంలోని దేశాయిపేట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం డీఆర్డీవో పీడీ లక్ష్మీనారాయణ, జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అకాల వర్షాలతో తడిసిన ధాన్యంను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వంగ వెంకటేశం, ఎంపీటీసీ శ్రీనివాస్, ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, ఎంపీవో శ్రీనివాస్, సంపత్, రఘు, ఏపీఎం అశోక్, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామానికి చెందిన మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చిత్తారి ప్రభాకర్‌కు దళితరత్న అవార్డు రాగా, శనివారం జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత చిత్తారి ప్రభాకర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు గిద్దె శంకర్, బొల్లె విజయ్‌కుమార్, అంజయ్య, సుమన్, మహేశ్, జగన్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణపై బీఎస్పీ వైఖరి స్పష్టం చేయాలి'

జగిత్యాల: ఎస్సీ వర్గీకరణపై బీఎస్పీ వైఖరి స్పష్టం చేయాలని ఎంఎస్‌పీ జగిత్యాల జిల్లా కన్వీనర్ దుమాల గంగారాం డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరాం మీద గౌరవం ఉంటే మాయావతి తక్షణమే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు మద్దతు తెలపాలని కోరారు. ఎస్సీల్లో అత్యల్ప జనాభా గల ఒక కులానికే అత్యధిక రిజర్వేషన్లు లభిస్తున్నాయని, అత్యధిక జనాభా గల మాదిగ, మాదిగ ఉప కులాలకు తగినంతగా రిజర్వేషన్లు అందక నష్టపోతున్నామన్నారు. కార్యక్రమంలో బెజ్జంకి సతీశ్, బోనగిరి కిషన్, దివాకర్, అరికెల సతీశ్, లక్ష్మణ్, శ్రీను పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా వైభవంగా ముగిశాయి. చివరి రోజు శనివారం నిత్య హోమం, నవగ్రహ హోమం, పూర్ణహుతి, కుంభాభిషేకం, రంగవల్లి, ద్వాదశ వారపూజ చేపట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పుష్పయాగం

రాయికల్: మండలంలోని మూటపల్లిలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం నాగవెల్లి, మహాపూర్ణహుతి, పుష్పయాగం, స్వామివారి ఊరేగింపు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. జెడ్పీటీసీ జాదవ్ అశ్విని పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జెడ్పీటీసీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, సర్పంచ్ బెక్కం తిరుపతి, నాయకులు రాజిరెడ్డి, రాజం, విష్ణు, ఆరె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమంలో ఎన్‌ఆర్‌ఐల పాత్ర కీలకం



బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

రాయికల్/కోరుట్ల: తెలంగాణ ఉద్యమంలో ఎన్‌ఆర్‌ఐల పాత్ర కీలకంగా మారిందని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. శనివారం లండన్‌లో రాష్ట్ర చలన చిత్ర టీవీ, థియేటర్ కార్పొరేషన్ చైర్మన్ కూర్మాచలం అనిల్‌తో కలిసి 22వ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో ఎన్‌ఆర్‌ఐ బీఆర్‌ఎస్‌సెల్ సేవలు మరువలేనివన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న పథకాలు సోషల్ మీడియా ద్వారా ప్రపంచ దేశలతో పాటు తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు విస్తరింపజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐ బీఆర్‌ఎస్ యూకే అధ్యక్షుడు అశోక్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రత్నాకర్, అడ్వైజరీ బోర్డు ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, నవీన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల వినూత్న నిరసన



కథలాపూర్‌లో మోకాళ్లపై నిలబడి కార్యదర్శుల నిరసన

కథలాపూర్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని శనివారం కథలాపూర్‌లో మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలం పూర్తయినందున రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. వీరికి వివిధ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు.

పంచాయతీ కార్యదర్శులకు సర్పంచులు, ఎంపీటీసీల మద్దతు

జగిత్యాలరూరల్: గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని చేపట్టిన సమ్మె శనివారం 9వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు శనివారం జగిత్యాల రూరల్ మండల సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్ విండో చైర్మన్లు పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి, సందీప్‌రావు మద్దతు ప్రకటించారు.

సారంగాపూర్: కార్యదర్శుల వెంటనే రెగ్యులర్ చేసి ప్రభుత్వం వారికి న్యాయం చేయాలని బీర్‌పూర్ మండలంలోని అధికార, విపక్ష సర్పంచ్‌లు బీర్‌పూర్ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు నల్ల మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు సంఘీభావం తెలిపారు. వారికి రూ. 15 వేలు అందజేశారు.

ఊడుస్తూ కార్యదర్శుల నిరసన

రాయికల్: తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మెలో శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఊడుస్తూ నిరసన వ్యక్తం చేశారు.

ధర్మపురి: జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జాజాల రమేశ్ డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శులకు రమేశ్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కుంట సుధాకర్, ఎండీ రషీద్, ఒడ్డేటి రాజన్న తదితరులున్నారు.

కొండగట్టులో కార్యదర్శుల పూజలు

మల్యాల: సీఎం కేసీఆర్ మనసు మారి, తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మల్యాల మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కొండగట్టు అంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సమ్మె మా హక్కు కాదని, తమ ఆవేదన మాత్రమేననే ఫ్లెక్సీతో కార్యదర్శులు నిరసన వ్యక్తం చేశారు.

గొల్లపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ పరిసరాలను శనివారం శుభ్రం చేసి కార్యదర్శులు నిరసన వ్యక్తం చేశారు. కార్యదర్శులకు బీఎస్పీ ధర్మపురి నియోజకవర్గ బాధ్యుడు నక్క విజయ్‌కుమార్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జేపీఎస్‌ల అధ్యక్షుడు షరీఫ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

పెగడపల్లి: పెగడపల్లిలో కార్యదర్శులు శ్రమదానం చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెగడపల్లి జీపీని సందర్శించిన డీఎల్‌పీవో

గొల్లపల్లి: పెగడపల్లి గ్రామపంచాయతీని డీఎల్‌పీవో కనకదుర్గ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆదాయ, వ్యయాలు, రికార్డులు తనిఖీ చేశారు. శానిటేషన్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆమె వెంట సర్పంచ్ శ్రీనివాస్, సిబ్బంది ప్రవీణ్, స్వామి ఉన్నారు.